క్లుప్తంగా

పాఠశాలకు గేటు ఏర్పాటు



స్కూల్ గేటును ప్రారంభిస్తున్న హెచ్ఎం నిరంజని

మామిడికుదురు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు స్కూల్‌కు ఐరన్ గేటును చేయించారు. రూ.20 వేలతో చేయించిన ఈ గేటును స్కూల్ హెచ్ఎం సీహెచ్ నిరంజని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాయసం సత్తిబాబు, భయ్యా మోహన్‌రావు, మిత్ర బృందం పాల్గొన్నారు.

వచ్చే విద్యాసంవత్సరానికి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్

సఖినేటిపల్లి: వచ్చే(2025–26)విద్యా సంవత్సరానికి మండల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ రానున్నాయని, వీటిని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచి పాఠశాలలకు అందించాలని రాష్ట్ర అబ్జర్వర్ అబ్దుల్ గని విద్యాశాఖను ఆదేశించారు. బుధవారం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో ఆ శాఖ ఆధ్వర్యంలో మండల సిబ్బంది, సీఆర్ఎంటీలకు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అబ్జర్వర్ అబ్దుల్ గని, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కిట్స్‌లో ప్రతి విద్యార్థికి మూడు జతల యూనిఫాంలు, బ్యాగు, టెక్స్ట్‌బుక్స్, వర్క్, నోట్స్ బుక్స్, బెల్ట్, ఒక జత షూ, సాక్స్, డిక్షనరీ ఉంటాయన్నారు. వీటిని పాఠశాలలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎంఈఓ–1 డీ కిషోర్ కుమార్, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

ఆలమూరు: గ్రామాల్లోనున్న ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేశారు. వేసవితాపం నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల వైద్యాధికారులు డి.సాయికిషోర్, కె.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఈ ప్యాకెట్లను సరఫరా చేశారు.

ఫ్యాక్టరీ యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించాలి

కొత్తపేట: ఫ్యాక్టరీ యాజమాన్యాలు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, స్థానిక ఆర్డీఓ పీ శ్రీకర్ సూచించారు. కొత్తపేట డివిజన్‌కు సంబంధించిన పారిశ్రామిక భద్రతా సమావేశం బుధవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈతకోట ఏపీసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెక్కంటి సీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అవిడి వసిష్ఠ పెస్టిసైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, పోతుకుర్రు ఛాయిస్ కానింగ్ కంపెనీ, దేవరపల్లి పద్మశ్రీ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్యాక్టరీ యాజమాన్యాలు పారిశ్రామిక భద్రతా సమావేశంలో పాల్గొన్నారు. ఆర్డీఓ శ్రీకర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల నిర్వహణలో భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.వి.మురళీకృష్ణ, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, పీహెచ్‌సీల వైద్యాధికారులు జి.కృష్ణ, సాయిలేఖ, కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐకి దేశవ్యాప్తంగా ఉత్తమ ప్రతిభా అవార్డు

రావులపాలెం: స్థానిక మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఓలేటి శ్రీనివాసుకు దేశ వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభా అవార్డు లభించినట్టు బుధవారం ఆయన తెలిపారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ మోటారు డిపార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రహదారి భద్రతపై ఉత్తమ సేవలు అందించడంతోపాటు పలు కార్యక్రమాలు చేస్తున్న వారిని గుర్తించి ఉత్తమ ప్రతిభా అవార్డులను అందించిందన్నారు. దేశ వ్యాప్తంగా ఎనిమిది మందికి అందించగా వారిలో తనకు ఈ గౌరవం దక్కిందని శ్రీనివాసు తెలిపారు. 15ఏళ్లుగా సేవలు అందిస్తూ ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత, పాఠశాల బస్సులపై 20 స్వార్ట్ ఫిలిమ్స్ తీసి సినిమా థియేటర్లలో వేయడం, రోడ్డు భద్రతా క్లబ్‌లు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేయడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు. అహ్మదాబాద్‌లో మంగళవారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో అక్కడ పోలీస్ కమిషనర్ సఫిన్ హసిన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్టు శ్రీనివాస్ తెలిపా రు. శ్రీనివాస్‌ను అధికారులు అభినందించారు.

నకిలీ జామీను పత్రాలపై కేసు

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బెయిల్ నిమిత్తం నకిలీ జామీను పత్రాలను సమర్పించిన సంఘటనపై ఆలమూరు పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం .. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలంలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన తాలి యేసురాజు, చొల్లా సునీల్ నిందితులిద్దరూ మండపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో గత ఏడాది నమోదైన కేసుకు సంబంధించి జామీను పత్రాలను సమర్పించారు. అయితే ఆ జామీను పత్రాలపై అనుమానం వచ్చిన జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బంది సహకారంతో విచారణ చేపట్టగా నకిలీ పత్రాలని తేలింది. నిందితులిద్దరికి తానెప్పుడూ జామీను పత్రాలను అందించ లేదని ఆ గ్రామ కార్యదర్శి కోర్టుకు తెలపడంతో నేరం రుజువైంది. దీంతో జడ్జి ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో కోర్టు సూపరింటెండెంట్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవితకు బాటలు వేస్తూ..

- విద్యార్థుల సేవలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం
- జిల్లాలో 430 మందికి ఉచిత శిక్షణ
- నాలుగేళ్ల నుంచి శిక్షణ కార్యక్రమాలు

మామిడికుదురు: విద్యార్థులకు బంగారు భవితకు బాటలు వేస్తూ.. వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తూ ఆంధ్రప్రదేశ్ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీలో ఉచితంగా శిక్షణ ఇస్తోంది. కోనసీమ జిల్లాలోని ఆరు కేంద్రాల ద్వారా సుమారు 430 మందికి ఈ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 26 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ ఉచిత శిక్షణకు హాజరవుతున్నారు. దాతల సహాయంతో శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేశారు. దీంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్‌లో కూడా శిక్షణ ఇస్తున్నారు.

ఆరు కేంద్రాల్లో శిక్షణ

మామిడికుదురు, మలికిపురం, అంబాజీపేట, కాట్రేనికోన, ఆలమూరు, కొత్తపేట మండలాల్లో ఈ ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కుల, మతాలకు అతీతంగా ఔత్సాహికులందరికీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. నాలుగేళ్ల నుంచి ఈ బృహత్తర కార్యక్రమంలో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం భాగస్వామ్యమవుతోంది. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై సరైన అవగాహన లేక వారు ఇబ్బంది పడుతున్నారని, అటువంటి వారికి మార్గదర్శం చేసేందుకు ఈ ఉచిత శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు.



మామిడికుదురు మండలంలో ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఉత్సాహంగా వస్తున్నారు



ఉచిత శిక్షణా తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. వారు ఎంతో ఉత్సాహంగా తరగతులకు హాజరవుతున్నారు. ఇక్కడ వారు నేర్చుకుంటున్న విషయాలు వారి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇక్కడ తర్ఫీదు పొందిన వారు మంచి ఫలితాలు సాధించారు. ఒక బృహత్తర కార్యక్రమం చేపట్టామన్న సంతృప్తి మాకు కలుగుతోంది. ఇదే ఉత్సాహంతో మరింతగా ముందుకు వెళ్తున్నాం.

– పితాని నాగేశ్వరరావు, కొత్తపేట మండల శాఖ అధ్యక్షులు

రూ.4 లక్షల ఖర్చు



నాలుగేళ్ల క్రితం ఉచిత శిక్షణ ప్రారంభించాం. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఉచిత శిక్షణ ఇస్తున్నాం. ఏడాదికి శిక్షణకు గాను సుమారు రూ.నాలుగు లక్షలు వరకు ఖర్చు అవుతోంది. సంఘంలో సభ్యులు ఈ మొత్తాన్ని భరిస్తున్నాం. దీంతో పాటు దాతల సహాయం కూడా తీసుకుంటున్నాం. శిక్షణ పొందుతున్న వారికి స్టడీ మెటీరియల్ ఇచ్చేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. వారి సహకారం మమ్మల్ని మరింతగా ప్రోత్సహిస్తోంది. దీనిని మరింత విస్తరించే దిశగా ముందుకు వెళ్తున్నాం.

– గుబ్బల మురళీకృష్ణ, కోనసీమ జిల్లా సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో బడి బాట ర్యాలీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్థానిక పాఠశాల నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ వెన్నపు సత్యనారాయణ, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా గూడపల్లి యూపీ స్కూల్

మలికిపురం: గూడపల్లి గ్రామ కొప్పిడి వారి మెరక యూపీ పాఠశాల జెడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయినట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ 9, 10 తరగతులు కూడా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సుందర బ్రహ్మయ్య, కటికిరెడ్డి గోపాల కృష్ణ, సత్యనారాయణ, సుందర బల్లబ్బులు పాల్గొన్నారు.

'దిశ'లో ప్రస్తావన అంశాలను పరిగణనలోకి తీసుకోరా..!

సమావేశంలో కొత్తపేట ఎంపీపీ గంగాధరరావు



అమలాపురం దిశ సమావేశంలో సమస్యలు ఏకరవు పెడుతున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సభ్యులు ప్రస్తావించే అంశాలను పరిగణలోకి తీసుకోరా? జవాబుదారీ లేదా? అటువంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకు? సమస్యలు ప్రస్తావించడం ఎందుకు? అని కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు వాపోయారు. ఎంపీ చైర్మన్‌గా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా దిశ కమిటీలో ఎమ్మెల్యేలతో పాటు ఎంపీపీలు సభ్యులుగా ఉన్నారు. ఇది ప్రతి 3 నెలలకు ఒకసారి సమావేశం జరగాలి. కానీ ఆ విధంగా జరగడంలేదు. లాస్ట్ మీటింగ్ గత ఏడాది అక్టోబర్ 30న జరగ్గా మళ్లీ దాదాపు ఆరు నెలల తరువాత నిర్వహించారు. ఎంపీ, దిశ చైర్మన్ గంటి హరీష్‌మాదుర్ అధ్యక్షతన కలెక్టర్, దిశ కన్వీనర్ ఆర్.మహేష్‌కుమార్ పర్యవేక్షణలో బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన దిశ సమావేశంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు పలు అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలకు జవాబుదారితనం ఉండేదని, ఇప్పుడు అది ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితంగా మంజూరైన డయాలసిస్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీపీ మార్గన కోరారు. ఓఎన్‌జీసీ నిధులు మంజూరు చేయించగా భవన నిర్మాణం పూర్తికాగా ఈలోపు ఎలక్షన్ రావడంతో బిల్లులు చెల్లించలేదని, దాంతో ఆ పనులు నిలిచిపోయాయని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంవత్సరానికి హెచ్‌డీఎస్ ఫండు రు.5 లక్షలకు పెంచాలని, నైట్ వాచ్‌మన్ పోస్టుల నియామించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో పనులను ప్రతిపాదించే అధికారం పాలకవర్గానికి ఇవ్వాలని కోరారు. బీసీ కార్పొరేషన్ వ్యక్తిగత రుణాలు మంజూరులో ప్రమేయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

చలివేంద్రం ప్రారంభం

పి.గన్నవరం: స్థానిక తన కార్యాలయం వద్ద తహసీల్దార్ పి.శ్రీపల్లవి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యన్నపు డాంగే, వీఆర్వోలు పి.నర్సింహరావు, కోరుకొండ శ్రీనివాస్, రమేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పత్రికా కార్యాలయంపై దాడి అమానుషం



అంబాజీపేటలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ రిపోర్టర్లు



తహసీల్దారు ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న పాత్రికేయులు

రాజోలు: ఏలూరు 'సాక్షి' దిన పత్రికా కార్యాలయంపై దాడి అప్రజాస్వామిక చర్య అని రాజోలు నియోజకవర్గ పాత్రికేయుల సంఘ సభ్యులు అన్నారు. బుధవారం పాత్రికేయుల సంఘ నాయకులు రాజోలు తహసీల్దారు ఎన్ఎస్ఎస్ ప్రసాద్, రాజోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులు ఏలూరు సాక్షి కార్యాలయంలో కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేయడం చాలా దారుణమన్నారు. జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంస్థలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పత్రికా కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. రాజోలు నియోజకవర్గ పాత్రికేయుల సంఘ నాయకులు కొంబత్తుల సురేంద్రకుమార్, తోట సత్యనారాయణ, కారుపల్లి శ్రీనివాస్, వి.వి.నాగేశ్వరరావు, వి.బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి అప్రజాస్వామ్యం

అంబాజీపేట: ప్రతీకా స్వేచ్ఛను అడ్డుకుంటూ దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని, ఇలాంటి సంఘటనలు చెడు సంప్రదాయాలకు బీజం వేస్తాయని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు సీఎస్ మూర్తి అన్నారు. ఏలూరు 'సాక్షి' కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచరులు దాడి చేయడాన్ని నిరసిస్తూ అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, మూర్తి మాట్లాడుతూ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, విధి నిర్వహణలో ఉన్న రిపోర్టర్‌పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. పత్రికలో వచ్చిన వార్తలపై అభ్యంతరాలు ఉంటే వివరణ ఇచ్చి సవరణ కోరాలని, ఇలా దాడి చేయడం ప్రజాస్వామ్యానికి, మీడియా స్వేచ్ఛకు గొడ్డలి పెట్టు అన్నారు. జర్నలిస్టులపై దాడులను ప్రభుత్వం తక్షణమే ఖండించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాక్షి కార్యాలయం పైన, రిపోర్టర్‌ను దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో తెలగారెడ్డి దుర్గాశంకర్, మాలే వెంకట దుర్గాప్రసాద్, మట్టపర్తి రాము, జార్జి విక్టర్ కుమార్, మట్టపర్తి రాజు, మహిపాల నాగరాజు, గుబ్బల నాగరాజు పాల్గొన్నారు.

ఆనందం పదింతలైన వేళ..



మొగలికుదురు విద్యార్థినులు కె.ఎల్.శ్రీకళ, కె.మహాలక్ష్మి | సయ్యద్ రషీద్ బేగం | బళ్ల వాణిశ్రీవిద్య | పిల్లి లక్ష్మీప్రణవ్య | కురసా తన్మయి శ్రీలక్ష్మి షణ్ముఖి | కొమ్ముల సుందర గణికమ్మ | ముందురి సాయి సత్యఆశ్లేష | జక్కంశెట్టి హర్షిత | తరిట్ల సూర్యరాజు | పిచ్చుక చైతన్య | కే అలేఖ్య



వాసంశెట్టి టింపు సాయి ఇంద్రశ్రీ | కె యశస్విని నాగశ్రీ | అత్తిలి పూజిత | పిల్లి హారిక (587) | పి.రిషితా సంతోషిని (584) | డి.సూర్యప్రకాష్ (579) | సిర్రా వర్షిత | రాయపురెడ్డి నాగసాయి భీమేశ్వర పవన్ | షేక్ అశిన బేగమ్



రావి శైలజా అన్నపూర్ణ (589) | కేతాశ్రీ వీర దుర్గభాను (584) | ఎం.రవిరాజు (578)



ఏడిద లాస్య ప్రియ (582) | పులిదిండి సనా (580) | సుంకర నాగచైతన్య(572)

- పది పరీక్షల్లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ
- అభినందనలు తెలిపిన పలువురు

మామిడికుదురు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలో 95.90 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు బుధవారం తెలిపారు. మండల పరిధిలోని 12 ప్రభుత్వ, అయిదు ప్రైవేటు స్కూళ్ల నుంచి మొత్తం 845 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 810 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 503 మంది విద్యార్థులకు 471 మంది విద్యార్థులు పాసై 93.64 శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. మొగలికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.మహాలక్ష్మి 586, కేఎల్.శ్రీకళ 586 మార్కులతో మొదటి స్థానం పొందారన్నారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన కుష్బూమ్ జహార 576, లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన బోనం సత్యమౌళిక 574 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు.

కొత్తపేట మండలంలో 84 శాతం

కొత్తపేట: 2025 పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కొత్తపేట మండలం 84శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 919 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 776 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 80 శాతం, ప్రైవేట్ పాఠశాలల నుంచి 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలో కొత్తపేట జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సయ్యద్ రషీద్ బేగం 587 మార్కులతో మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించగా, 584 మార్కులతో వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బళ్ల వాణిశ్రీవిద్య ద్వితీయ స్థానం, 578 మార్కులతో అదే పాఠశాల విద్యార్థిని పిల్లి లక్ష్మీప్రణవ్య తృతీయ స్థానం సాధించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉత్తీర్ణత

గంటి, గోలకోటివారిపాలెం 94 శాతం, మోడేకుర్రు 93 శాతం, కొత్తపాలెం 88 శాతం, చప్పిడివారిపాలెం, వానపల్లి 86 శాతం, తొత్తరమూడి 83 శాతం, కొత్తపేట బాలికోన్నత పాఠశాల 78 శాతం, మందపల్లి 77 శాతం, వాడపాలెం 74 శాతం, కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 68 శాతం, పలివెల 66 శాతం సాధించారు.

అభినందనలు

అత్యధిక మార్కులు సాధించిన ఉత్తమ విద్యార్థులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎంపీపీ మార్గాన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి గారు, ఆర్డీఓ పి.శ్రీకర్, ఎంపీడీఓ పి.నరేష్ కుమార్, తహసీల్దార్ వై రాంబాబు, ఎంఈఓలు ఎం.హరిప్రసాద్, కే లీలావతి, హెచ్ఎంలు అభినందించారు.

అంబాజీపేట మండలంలో 94 శాతం

అంబాజీపేట: మండలంలోని తొమ్మిది జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి పదిలో 94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. 394 మంది పరీక్షలకు హాజరుకాగా 369 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. రావి శైలజా అన్నపూర్ణ 589 (గంగలకుర్రు), కేతా శ్రీ వీరదుర్గభాను 584 (తొండవరం), ఎం.రవిరాజు 578 (అంబాజీపేట) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. బాలురు 187, బాలికలు 182 మంది ఉత్తీర్ణత పొందారన్నారు.

పి.గన్నవరం మండలంలో 89.24 శాతం

పి.గన్నవరం: మండలంలో 89.24 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ కోన హెలీనా తెలిపారు. మొత్తం 781 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 679 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి మానేపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఏడిద లాస్యప్రియ 582 మార్కులతో మండల ప్రథమ స్థానం, ఆర్.ఏనుగుపల్లికి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 580 మార్కులతో ద్వితీయ స్థానం, పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుంకర నాగచైతన్య 572 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించారు. వీరిని ఎంఈఓలు హెలీనా, వీరభద్రానందంతో పాటు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, అధ్యాపక సిబ్బంది అభినందించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి పి.గన్నవరం సాయితేజ స్కూలు విద్యార్థిని లూటుకుర్తి తనూజ 588 మార్కులు, మట్టపర్తి దీపిక సాయి 583 మార్కులు, శిరిగినీడి వీవీ సతీష్ 581 మార్కులు సాధించినట్టు కరస్పాండెంట్ అన్నాబత్తుల హనుమాన్, ప్రిన్సిపాల్ సుంకర వెంకట కృష్ణ తెలిపారు.

సఖినేటిపల్లి మండలంలో 97.7 శాతం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి మండలం 97.7 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో 5వ స్థానంలో నిలిచిందని ఎంఈఓ–1 డీ కిషోర్ కుమార్ తెలిపారు. మండలంలో 653 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 638 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉయ్యూరువారి మెరక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పిచ్చుక చైతన్య 577 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం డీ.జగదీప్ కుమార్ చెప్పారు. అంతర్వేదిపాలెం(ఎంజీ) జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కే అలేఖ్య 574 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచినట్టు హెచ్ఎం జే కనక లింగేశ్వరరావు తెలిపారు.

ఆలమూరు మండలంలో 92 శాతం

ఆలమూరు: ఆలమూరు మండలం 92 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన 728 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగాఅందులో 672 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆలమూరులోని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో చదివిన విద్యార్థినులు పిల్లి హారిక (587), పిల్లి రిషితా సంతోషిని (584) మార్కులు సాధించి మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చెముడులంకలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థి డి.సూర్యప్రకాష్ 579 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.

శానపల్లిలంక విద్యార్థికి మండల మొదటి స్థానం

అయినవిల్లి: పదో తరగతిలో శానపల్లిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సిర్రా వర్షిత 587 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. కొండుకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రాయపురెడ్డి నాగసాయి భీమేశ్వర పవన్ 585 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే చింతనలంకకు చెందిన షేక్ అశిన బేగమ్ 576 మార్కులు సాధించి తృతీయ స్థానం దక్కించుకుంది. మొత్తం మండలంలోని 11 జిల్లా పరిషత్, 4 ప్రైవేటు స్కూల్స్‌కు చెందిన 698 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 672 మంది ఉత్తీర్ణులు అయ్యారు.



విద్యార్థిని జాహ్నవిని అభినందిస్తున్న ఎంఈఓ మనోహరం



కొత్తపేటలో మండల టాపర్ షణ్ముఖిని అభినందిస్తున్న ఎంపీపీలు మార్గన, తోరాటి

రాజోలు మండలంలో 90 శాతం

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ నల్లి మనోహరం అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని వెత్సా జాహ్నవి 584 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. కూనవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.భవ్యశ్రీ దుర్గ 579 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 599 మంది విద్యార్థులకు గాను 502 మంది ఉత్తీర్ణులయ్యారు.

షణ్ముఖికి అభినందనలు

కొత్తపేట: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 590 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిన కాంతిభారతి హైస్కూల్ విద్యార్థిని కురసా తన్మయి శ్రీలక్ష్మిషణ్ముఖిని కొత్తపేట, ఆలమూరు ఎంపీపీలు మార్గన గంగాధరరావు, తోరాటి లక్ష్మణరావు అభినందించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని తన తల్లిదండ్రులు ఆదిమూర్తి మహాలక్ష్మి, రామకృష్ణశర్మ జ్ఞాపకార్థం ఉత్తమ ఫలితాలతో మండల టాపర్‌గా నిలిచిన శ్రీలక్ష్మిషణ్ముఖికి రూ.20 వేలు ప్రోత్సాహాన్ని బుధవారం ఎంపీపీలు గంగాధరరావు, లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు షణ్ముఖని శాలువా, మెమెంటోతో సత్కరించారు. నగదు ప్రోత్సాహాన్నిచ్చిన పూర్వ విద్యార్థినిని అభినందించారు.

రావులపాలెం మండలంలో 88.4 శాతం

రావులపాలెం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మొత్తంగా కలిపి 88.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓ బి.శ్రీనివాసరాజు తెలిపారు. తొమ్మిది జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తంగా 598 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 474 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 79.3 శాతం లభించిందన్నారు. మండలంలో మొదటి మూడు స్థానాల్లో ఆరు వందల మార్కులకు గాను రావులపాలెం జెడ్పీ బాలికల హైస్కూల్‌కు చెందిన వాసంశెట్టి టింపు సాయి ఇంద్రశ్రీ(577) ప్రథమ స్థానం నిలిచిందన్నారు. ఈతకోట హైస్కూల్‌కు చెందిన కె.యశస్విని నాగశ్రీ(576) ద్వితీయ స్థానం , పొడగట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు చెందిన అత్తిలి పూజిత(575 మార్కులు) తృతీయ స్థానం సాధించారన్నారు. విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు అభినందించినారు.